


ఆ ఇంట్లోంచి సుబ్రమణ్యం గారి శవం వెళ్ళి పదిహేనో రోజు ఆ రోజు ఇల్లంతా ఇన్నాళ్ళు సందడిగా పెళ్ళిళ్ళులా వుండి ఈ రోజే శ్మశాన నిశబ్దం ఆవరించింది. పెద్దవాళ్ళు చావు పెళ్ళితో సమానం అంటారు. అంటే సుబ్రమణ్యంగారు మరీ పెద్దవారు కాదు. ఏ ఎనభై తొంభై ఏళ్ళోలేవు. ఆయనకి పోయే నాటికి అరవై ఏడు ఏళ్ళు మాత్రమే.

ఈ రోజుల్లో అరవై ఏడేళ్ళంటే పోయే వయసు కాదు. కాని ఆయన పోయారు. మంచాన పడకుండా, తీసుకోకుండా, ఎవరి చేతా చేయించుకోకుండా హాయిగా దాటిపోయాడు. అదృష్టవంతుడన్నారు అందరూ. ఉదయం కాఫి తాగుతున్న మనిషి కాఫీ గ్లాసు పక్కన పెట్టి పక్కకి వరిగారు అంతే.

ఆయన ఇద్దరు కొడుకులు, కోడళ్ళు, ఇద్దరు కూతుళ్ళు, అల్లుళ్ళు, మనవలు, ఆయన చెల్లెళ్ళు, అన్నదమ్ములు, బావమరదులు ఆవిడ వైపు చుట్టాలు అందరూ కలిసే సరికి వంటవాళ్ళు వడ్డనలు, భోజనాలు అంతా పెళ్ళిళ్ళులాగానే ఇల్లు కిటకిటలాడింది. బంధువులు దిగినప్పుడల్లా పరామర్శని, వూళ్ళోవాళ్ళు వచ్చినప్పుడల్లా మాత్రం ఆ ఇల్లు నిశ్శబ్దం అయ్యేది.

రాగాలు పెట్టి ఏడవలేని సంస్కారం వున్న వాళ్ళు కనుక అయిన వాళ్ళు, ఆప్తులు నిశబ్దంగా కన్నీరు కార్చేవారు. కొందరు రాని కన్నీళ్ళని పదే పదే తుడుచుకుని దుఃఖించేవారు. ఏ మయితేనేం సుబ్రమణ్యం గారి హయాం ఆ ఇంట్లో ముగిసిపోయింది. కొడుకులు కర్మకాండ తాహతుకి తగ్గట్టు యథావిధిగా చేసి తండ్రి రుణం తీర్చుకున్నారు. రిటైర్డ్ డిస్ట్రిక్ట్ జడ్జిగారి ఆత్మశాంతికి కోర్టులో ఆ రోజు రెండునిమిషాలు

మౌనం పాటించి లాయర్లు తమ డ్యూటీ అయిపోయినట్టు భావించేశారు.

ఆ ఇంట్లో ఆయన లేని లోటుని ఇంకా నమ్మలేనిది ఆయన అర్ధాంగి అన్నపూర్ణమ్మ మాత్రమే. ఆయన పోయారంటే ఇంకా ఆవిడకి నమ్మకంగా అన్పించడం లేదు. అంచేత ఆవిడకసలు పెద్దగా దుఃఖం, కడుపు లోంచో, మనసులోంచో తన్నుకు రావలసినంత దుఃఖం రాలేదు. నలభై ఏళ్ళ కలిసి బతికారు కాని, మనసులు కలబోసుకుని బతకలేదు వాళ్ళు. అసలే హఠాత్తు మరణం. దానికి తోడు మనసులో ఒకరి కోసం ఒకరు బతికాం అన్న ప్రేమ, అనురాగం కరవయిఆవిడకిదంతా ఏదో ఆవిడ ప్రమేయం లేకుండా స్టేజిమీద బలవంతంగా నిలబెట్టి నటింపచేసి, సంభాషణలు పలికించినట్టు లోకం ఏమనుకుంటుందో నన్నట్టు రాని దుఃఖం మొహాన పెట్టక తప్పలేదు. పరామర్శకి వచ్చినప్పుడల్లా ఇదేం బాధరా భగవంతుడా అన్నట్టు మూల కూర్చుని రాని ఏడుపుని నటించడం - గత పదిహేనురోజులుగా ఆ ఇంట్లో జరిగిన భాగోతంతో, ఇంటినిండా మనుషులు పడుకునే వీలులేక ఆవిడ మానసికంగా, శారీరకంగా అలిసిపోయింది. ఎప్పుడింత తిని హాయిగా పడుకుంటానో అనిపించింది ఆవిడకి. పుట్టింటికి రావాలమ్మా వచ్చి పది రోజులుండి వెళ్ళు అని అన్నదమ్ములు బతిమాలినా ససేమిరా అంది. పాపం ఈ ఇల్లు విడిచి రాలేక పోతూంది. అని సమాధాన పడివెళ్ళారు ఆమె పుట్టింటి వారు. కూతుళ్లిద్దరూ పిల్లల చదువులమ్మా ఎలా వుండడం, అలా అని ఎలా వెళ్లం అంటూ వాపోయారు. ఎవరుండి ఏం చేస్తారమ్మా. ఎన్నాళ్ళు ఎవరికోసం ఎవరుంటారు. నా కోసం మీ పనులు మానుకోకండి అంది అన్నపూర్ణమ్మ. తల్లి విరక్తితో మాట్లాడుతూందనుకుని ఆవిడని ఓదార్చి, ధైర్యం చెప్పి రైలెక్కారు ఆడపిల్లలు. రెండో కొడుకు బెంగుళూరులో కంపెనీలో పెద్ద ఉద్యోగం. సెలవు లేదమ్మా అని నసిగాడు. వెళ్ళు నాయనా నాకా భగవంతుడే తోడు, అయినా అన్నయ్య వున్నాడుగా నాకోసం ఏం దిగులు వద్దు అంటూ రెండో కొడుక్కి పర్మిషన్ ఇచ్చింది ఆవిడ. వచ్చిన బంధువులంతా వుండకూడ దంటూ పదకొండోరోజు కొందరు, దగ్గరవాళ్ళు పద మూడోరోజు వెళ్ళారు. వున్నవూర్లోనే లాయరు ప్రాక్టీసు చేస్తున్న పెద్దకొడుకు ఇంక ఈ జంఝాటం అంతా నా మీదే రా బాబూ అనుకున్నాడు. అంతా నాల్గురోజులు ముట్టపు మాపుగా వచ్చి హాయిగా పోయారు. ఈ ఇల్లు నాకు పుస్తైముడి, ఈ చాకిరి నాకు తప్పదు అని మనస్సులో విసుక్కుంది లాయరు మొగుడ్ని చేసుకున్నందుకు, వున్నవూర్లో ఉద్యోగమున్న మొగుడ్ని చేసుకున్నందుకు రోజుకి నాలుగుసార్లన్నా పశ్చాత్తాప పడే పెద్దకోడలు. మామగారు పోవడంతో ఆ పశ్చాత్తాపం మరిది, తోడి కోడలు టింగురంగా అని వెళ్ళిపోగానే పుడుకు మొత్తనంగా మారింది.

ఎవరి పాటికి వారు వెళ్లాక ఆ ఇల్లు గాలివాన వెలిసాక మాదిరి అయింది. గాలివాన జోరు హోరు తగ్గినా, ఇల్లంతా ఆ గాలివాన గుర్తులుగా చిత్తడి, ఆకులు, అలములు, చెత్తా చెదారం ఎలా మిగులుతుందో ఇంట్లో నిశ్శబ్దం ఏర్పడినా ఇల్లంతా అడవిలా ప్రతి గది బట్టలతో పక్కలతో మరకలతో గలీజులయింది. పెరడంతా మాసే నాథుడు లేనట్టు ఎంగిలి విస్తరాకులు ఎగురుతున్నాయి. పది రోజులు ఇదంతా దేవుకోవాలిరా భగవంతుడా అని పెద్దకోడలు బెంగపెట్టుకుని ఈ రోజు నావల్లకాదు బాబు అని మంచం ఎక్కింది. ఇన్నాళ్ళ ఏడుపుల మొత్తలతో తిండి నిద్రలేని అన్నపూర్ణమ్మ ఆరోజు ఎనిమిది గంటల కింత అన్నం కడుపులో పడగానే వెర్రి నిద్ర ముందుకు వచ్చిందావిడకి.

అయితే వీటన్నింటిమధ్య సుబ్రమణ్యంగారుపోయిన పదిరోజుల్లో అంత హడావిడిలోను, అంత గొడవల మధ్య కూడా అందరి మనస్సుల్లో ఒక ప్రశ్న మెదలాడుతూనే వుంది. కొడుకులు ఆరాటంగా, బంధువులు ఏం రాశాడో అన్న కుతూహలంగా విల్లుకోసం చూశారు. పదో రోజున కాబోలు సుబ్రమణ్యంగారి పెద తమ్ముడు ఏరా ప్రభాకర్ మీ నాన్న ఏదన్నా విల్లు రాశాడా లేదా ఇంతకీ అని ఆరా తీశాడు. ఆ మాట ఎవరూ అనకుండా తనెలా ఎత్తడం ఆ ప్రసక్తి అని మనసులో మదన పడుతున్న ప్రభాకర్ ఏమో చిన్నాన్న తెలియదు చూడాలి. నా కయితే ఏం చెప్పలేదు మరి అన్నాడు ఆరాటంగా. 'హఠాత్తుగా పోయాడు మరి రాశాడో లేదో చూసుకోండి. రాస్తే పరవాలేదుగాని... అని మధ్యలో ఆపేశాడు సుబ్బారావుగారు.

ఆ మాటే ప్రభాకర్, దివాకర్ల మనస్సులో మెదులుతూంది పది రోజులుగా. అయినా విల్లు రాయకుండా పోతే గొడవే. ఆస్తిసమానంగా ఆడపిల్లలతో పంచుకోవాలి. తల్లివుంది ఆవిడకీ ఓ వాటా ఇవ్వాలి.

ఏమ్మా వదినా నీకేమయినా తెలుసా? అన్నయ్య విల్లురాసిన సంగతి ఏమన్నా చెప్పాడా.

"అయ్యో నాయనా నీ అన్నయ్య సంగతి నీ వెరుగవా, ఇంట్లో పెళ్ళాం చాకిరికి తప్ప మంచికి చెడ్డకి సంప్రదించడం ఎప్పుడన్నా వుందా ఈ నలభై ఏళ్లల్లో అన్నపూర్ణమ్మ ముక్కు చీదింది.

"చూడరా ప్రభాకర్ ఇనప్పెట్టె, బీరువా అవి తీసిచూడు. విల్లు వుంటే నలుగురి ముందు ఒకసారి చదివితే మంచిది అన్నారు సుబ్బారావుగారు. ఇప్పుడెందుకులే ఆయన పోయి పట్టుమని పది రోజులవలేదు. ఆస్తులు పంపకం మాట ఎందుకు అని ఏ ఒక్కరూ అనలేదు. అనుకోలేదు. పిల్లలకి ఆరాటంగా, చుట్టాలకి కుతూహలంగా వుంది.

ప్రభాకర్ ఇనప్పెట్టె, బీరువాలు, బ్రీఫ్ కేస్‌లు, డ్రాయర్లు, పెట్టెలు, బట్టల మధ్య అన్నీ లాగి, పీకి, కెలికి చూశాడు. కాని విల్లు మాత్రం ఎక్కడా కనపడలేదు. నిరాశపడ్డాడు.

'రాసినట్టు లేదు బాబాయి... మరి ఇప్పుడెలా అన్నాడు సందిగ్ధంగా.

"రాయకపోతే అందరికి సమానంగా వస్తుందిరా అబ్బాయి. వున్నదేదో నలుగురు పంచుకోవాలి మరి. మీ అమ్మతో కలిపి ఐదు వాటాలవుతుంది. ఆవిడ తదనంతరం ఆ వాటా మళ్ళీ మీ అందరికి సమంగా వచ్చేట్టు పంచుకోవాలి. ఆడపిల్లలు అక్కరలేదంటే తప్పనాలుగు వాటాలు వేయాల్సిందే. ప్రభాకర్ చెల్లెళ్ళ వంక ఆరాటంగా చూశాడు. చెల్లెళ్ళు మంచి కుటుంబాలలో పడ్డారు. మొగుళ్ళు మంచి ఉద్యోగాలలో వున్నారు. మాకెందుకులే అక్కరలేదు అనరా అన్నట్టు ఆశగా చూశాడు. కాని చెల్లెళ్ళు నోరుమెదపలేదు. వుత్తినే వస్తుంటే డబ్బు చేదా, ఎందుకు వద్దంటాం మాకేం వెర్రా అన్నట్టు కాగల కార్యం గంధర్వులే తీరుస్తారు. మనం ఎందుకు బయట పడడం అన్నట్టు నోరు మెదపలేదు.

"ఏమోయ్ ప్రభాకర్ ఇప్పుడెందుకయ్యా ఈ ఆస్తి



ఇటీవల హైదరాబాదులో అంతర్జాతీయ ఇంద్రజాలికుల మహోత్సవం జరిగిన సందర్భంగా ప్రదర్శన యిస్తున్న మెజిషియన్ డి. మోహనరావు (హెచ్.సి.ఎల్.)

పంపకాల మాటలు. మీ అమ్మగారింక వుండగానే, పదో రోజున్నా కాకుండా ఈ మాట లెందుకు, తరువాత మాసుకోకూడదా? అంతగా అయితే సంవత్సరీకానికి వచ్చినప్పుడు మాడవచ్చుగదా పెద్ద అల్లుడు ముకుంద రావు కాస్త ఇంగితం కనపరిచాడు.

"అదీ నిజమే అనుకోండి, నన్నడిగితే అక్కయ్య వున్నన్ని రోజులు-ఆస్తి ఉమ్మడిగా వుండడమే మంచిది. ఆవిడుండగా అప్పుడే ఈ పంపకాలేమిటి. ఏం పంచు కున్నా ఆవిడ తదనంతరం అయితేనే బాగుంటుందని నా ఉద్దేశం. అన్నాడు అన్నపూర్ణమ్మ పెద్ద తమ్ముడు నారాయణ. అతని మాటల్లో సబబు కన్పించింది చుట్టాలకి. ప్రభాకర్‌కి మాత్రం ఆ మాట నచ్చలేదు. అయినా బొత్తిగా బయటపడి పోవడం ఇష్టం లేక మామయ్య వంక కాస్త గుర్రుగా చూశాడు.

'అది కాదు మామయ్యా... ఏదో అనుకుని రాసు కుంటే మంచిదిగాదా ఎప్పటికి ఎలా వస్తుందో నాన్న హఠాత్తుగా పోయారు. విల్లు రాయక పోబట్టే కదా ఈ ఆలోచన్లు...

'అయితే ఇప్పుడే మీ అమ్మ బతికి నంతకాలం అంటే ఆవిడ అధీనంలో వుండేట్టు తదనంతరం ఫలానాది ఫలానావారికి అన్నట్టు రాసుకోండి కావలిస్తే అన్నాడు నారాయణ.

'అవును, అలా చేయ్యరా ప్రభాకర్ మీ అమ్మకీ తృప్తిగా వుంటుంది. ఇప్పటి నుంచి ఆస్తి పంపకాలంటూ అయితే కుటుంబం విడిపోతుంది. ఆవిడ వున్నన్ని రోజులు ఇదంతా ఆవిడదే గదా, తరువాతే మీ కని రాసుకోండి. ఇప్పుడు ఈ ఆస్థి రాకపోతే గడవని వారెవరూ లేరుగదా, పెద తమ్ముడు సుబ్బారావు అన్నారు. ఏ మంటావు అమ్మా వదినా.

'అయ్యో నాదేం వుంది నాయనా, ఎప్పుడన్నా ఈ ఆస్థులు వివరాలు ఆయన నాకేం చెప్పారా. ఏదో ఇంత తిని నా ఇంట్లో నేను పడివుండేట్టు చూడు బాబు. ఇంకెవరి కొంప పట్టుకు వేళ్ళాడకుండా. నా బరువు ఈ ఇంట్లో తెల్లారిపోతే చాలు నాయనా. మీగతాది ఎవరెవరు ఎలా కావాలంటే అలా రాయించుకోమను. పెద్దవాళ్ళు మీరు నలుగురు వుండగానే మంచి చెడ్డా ఆలోచించి ఎవరికి అన్యాయం జరక్కుండా నల్గురికి సమానంగా రాయించండి నాయనా అంది అన్నపూర్ణమ్మ.



'చూడండి మామయ్యగారు. అత్తగారున్నన్నిరోజులు ఆస్తి అంతటిమీదా సర్వహక్కులు ఆవిడవే, అంటే అమ్మడం అని కాదు. అనుభవించడం వరకు ఆవిడకే హక్కు. ఆవిడ తదనంతరం ఎవరెవరికి ఏం చెందాలో పెద్దవాళ్ళు మీరు ఆలోచించిరాయించండి. పెద్ద అల్లుడు అన్నాడు. ప్రభాకర్‌కి అందరిమాటలు వింటుంటే వళ్ళు మండిపోతూంది. ఈ ఆస్తి తల్లితో ముడిపెట్టకుండా ఎవరిది వారికి రాసేస్తే బాగుండును అని వుంది. కాని నలుగురి మధ్య ఎలా తేలిపోవడమో అర్థంకాలేదు. తెగేసి నా వాటా నాకివ్వండి అని తండ్రి పోయిన పదో రోజు చెప్పడం అంటే, బంధువులందరి ముందు తేలిపోవడం ఏం బాగుంటుంది అని మథన పడ్డాడు. అన్నగారున్నారుగా అన్న కి వస్తే నాకు మాత్రం రాదా అన్నట్టు దివాకర్ గడుసుగా ఏం మాట్లాడ లేదు. ఆడపిల్లలు మాకేం అక్కర లేదు మాకున్నది చాలు అంటారేమో నన్న ఆశ లేకుండా వాళ్ళు ఏం మాట్లాడ లేదు. పెద్ద బావగారి మాటలబట్టి తల్లి తదనంతరం నల్గురికి సమానంగా అన్నాడంటే ఆస్తి వాళ్ళు వదులుకోరు అని అర్థం అవుతుంది. తండ్రి ఏదో విల్లు రాసిపోతే ఈ గొడవ రాకపోను అనుకున్నాడు. అతనికి అసంతృప్తిగా వుంది ఈ వ్యవహారం. కాని అతని భావాలతో ప్రమేయం లేనట్టే పెద్ద లందరూ కల్సి ఆస్తి ఏ విధంగా రాయించుకోవాలో నిర్ణయించేశారు. ఈ ఇల్లు పెద్దకొడుకు ఈ వూర్లో వుంటాడు కాబట్టి అతనికి చెందేట్టు, బెంగుళూరులో చిన్న కొడుకు ఎలాగో స్థలం కొనుక్కున్నాడు అక్కడ సెటిల్ అవుతాడు. కనుక పొలం అతని పేర పెడ్తే అది అమ్మి అతను ఇల్లు కట్టుకుంటాడో పొలికే వుంచుకుంటాడో అతనికే వదిలారు. ఆడపిల్లలకి ఇంట్లోవున్న రెండు లక్షల క్యాష్, తల్లి బంగారం వచ్చేటట్టు ఇదంతా అన్నపూర్ణమ్మగారి తదనంతరం చెందేట్టు విల్లు రాసి సాక్షి సంతకాలు పెట్టించి తమ పని అయిపోయినట్టు పెద్దలంతా వెళ్ళిపోయారు. మిగతా వాళ్ళెవరికీ అంత బాధ అనిపించ లేదు కాని అక్కడుండాల్సిన ప్రభాకర్ మాత్రం ఈ ఏర్పాటు ఏమీ నచ్చలేదు. నచ్చక చేసేదేం లేదు కనుక మొహం మాడ్చుకున్నాడు.

అన్నపూర్ణమ్మకి మాత్రం ఈ ఏర్పాటు సంతృప్తిగానే వుంది. ఆయన విల్లురాయకపోవడం మంచిదే అయింది. రాసివుంటే తన పేర ఏం రాసేవారుకాదు. ఆడపెత్తనం మంగలి వైద్యం 'ఆడదాని చేతిలో డబ్బు' 'మగాడి చేతిలో బిడ్డ దక్కవు' లాంటి అభిప్రాయాలు ఆయనివి. ఆడదంటే ఇంట్లో చాకిరికి, పిల్లలని కనడానికి పెంచడానికే తప్ప ఎందుకు పనికి రాదనే పాతకాలం అభిప్రాయాలున్న మనిషాయన. ఆడదెప్పుడూ తండ్రి, భర్త, కొడుకు ఇలా ఎవరో ఒకరి మగవాడి రక్షణలోనే వుండాలిగాని ఆడదానికేం తెలుసు మానేజ్‌మెంట్ అనే మనస్తత్వం గల వ్యక్తి. ఇద్దరు కొడుకులున్నారు గానీ రోజులు వాళ్ళ దగ్గిర వెళ్ళిపోతాయిలే అని తన పేర ఏం రాసేవారుకాదేమో. అప్పుడు తనకి కొడుకుల పంచనపడి వుండాల్సిన గతి పట్టేది. పోతూ పోతూ ఆయన చేసిన మంచిపనేమో ఇది! నలభై ఏళ్ళు కాపురం చేసినందుకు నిలవ నీడ దొరికింది ఇప్పుడు. హు బ్రతికినన్ని రోజులు తనని ఓ మనిషిలా ఎప్పుడు చూశారు గనుక - నీకేం తెలుసు నోర్మూసుకో. వంటింట్లో పడివుండక తగుదునమ్మా అని మాట్లాడుతున్నావా అన్నిపాములూ తలెత్తితే తాడిపామూ తలెత్తిందిట లాంటి హేళన తప్ప తనని ఓ మనిషిగా ఆయన ఎప్పుడూ గుర్తించలేదు. కసుర్లు విసుర్లు తప్ప అభిమానం, ఆప్యాయత ఏం పంచి ఇచ్చారు కనుక, చిరబురలు, అథార్టీ చలాయించి ఆజ్ఞలు జారీ చేయడం తప్ప అనురాగంతో వశపరుచుకున్నారా! కష్టంలో సుఖంలో తన సలహా ఎప్పుడన్నా అడిగారా, ఆచరించారా, మగాడ్ని, సంపాదిస్తున్నవాడిని ఇదంతా నాది అని తప్ప మనది అని ఎన్నడన్నా అన్నారా? పెళ్ళాం కనక అదంతా భరించింది. మొదట్లో కష్టం అన్పించినా అలవాటయి తరువాత ఏం అన్పించకుండా తనమానాన తనుండేది ఇంట్లో చాకిరి చేసుకుంటూ, పిల్లల్ని కని పెంచుకుంటూ, ఆయనగారు తిట్టిన రోజు ఏడ్చుకుని, దగ్గిరికి తీసుకున్న రోజున పొంగిపోయి అదే లోకం అనుకుంటూ ఇన్నాళ్ళు గడిపింది. కాపురానికి వచ్చిన నలభై ఏళ్ళకి తనకంటూ తనదంటూ విల్లు రాయకపోబట్టి మిగిలింది రాస్తే ఈ ఇల్లు పెద్ద కొడుక్కి రాసిపోయేవారు. ఇన్నాళ్ళు మొగుడి జులుం, ఇప్పుడింక కొడుకు హయాంలో బట్టకట్టవలసి వచ్చేది. ఏదో ఆదేముడికి దయకలిగి విల్లు రాయలేదు నయమే అనుకుంది.

** ** ** **

"ఏమిటండీ, మన కొచ్చేదేదో విడిగా రాయించుకోకుండా ఇలా ఆవిడగారున్నన్ని రోజులు ఉమ్మడిగా ఆస్తి వుండడానికి ఒప్పుకున్నారు. గదిలో పద్మ మొగుడ్ని దులపడం మొదలు పెట్టింది.

'ఏం చెయ్యమంటావు పెద్దవాళ్ళంతా అలా అంటున్నప్పుడు నాన్న పోయిన పదోరోజు నా ఆస్తి నాకు పారేయండి అని ఎలా అడగమంటావు ప్రభాకర్ అన్నాడు.

"మీ బాబాయి, మామయ్య పెద్ద తగుదనమ్మా అని చెప్పవచ్చారు. వాళ్ళ సొమ్మేం పోయింది ఇతరులకి ఎన్ని నీతులైనా చెప్పచ్చు. అంతా ఎవరి వాటాకి వాళ్ళు చక్కగా చెడతారు. మనం ఇక్కడుండి ఏడవాల్సిన వాళ్ళం, ఈవిడకి మనకి లంపటం తప్పదుగా..."

పదిహేను రోజుల తర్వాత గాఢ నిద్ర పట్టి ఎందుకో ఉలిక్కి పడి లేచిన అన్నపూర్ణమ్మ పెరట్లోకి లేచి వెళ్ళింది. కొడుకు గదిలోంచి కిటికీ దగ్గరగా వినవస్తున్న మాటలకి ఆగిపోయింది.

"మనకొచ్చేదే విడిగా మన పేర వుంటే మన ఇష్టం వచ్చినట్టుండేవారం. ఇప్పుడింక మీ అమ్మగారి దయాదాక్షిణ్యాల మీద బతకాలా. ఇదేం పనికిరాదు. ఎవరి వాటా వారు పంచేసుకుందాం అని చెప్పండి మీ తమ్ముడితో, చెల్లెళ్ళతో మీ ఆస్తి మీ ఇష్టం మీ మామయ్య వాళ్ళ మాటలు వినాలని ఏం లేదు వుండాల్సింది, చెయ్యాల్సింది మనం..."

"అంతా వూరుకుంటే మనంఏదన్నా అనిఅందరిలో తేలికైపోవడం ఏం బాగుంటుంది పద్మా అందరిలో చెడ్డవాళ్ళం అయిపోతాం.

"అయితే అయ్యాం, ఎవరేం అనుకుంటారోనని నాకేం భయం లేదు. మీ అమ్మగారికింక పట్టుమని అరవైలేవు. ఇంకా పదేళ్ళో, ఇరవై ఏళ్ళు బతుకుతారో ఎవడికి తెలుసు. అన్నాళ్ళు మనం నోరు మూసుకు కూర్చోవాలా. అదేం కుదరదు నేను చెప్తున్నాను."

"అబ్బ ఇప్పటికి వూరుకో పద్మా, నాల్గు రోజులు పోనీ చూద్దాం. ఇంట్లోనే వుంటాంగా ఇప్పుడేం కొంప మునిగింది. నాన్నగారు లేరుగాని మిగతాదంతా అలాగే వుంటుందిగా' అన్నాడు ప్రభాకర్ పెళ్ళాన్ని అనునయిస్తూ - వింటున్న అన్నపూర్ణమ్మ మనసు చివుక్కు

## చిరుదివ్వె

పడమరవైపు వెళ్ళిపోయిన సూర్యుడు
పుడమి వైపు దీక్షగా చూశాడు
చీకటి తుఫానులో చిక్కుకున్న
చిన్న కుటీరంలా వుంది పృథ్వీమండలం
"నేను లేకుంటే ఈ ప్రపంచం
మానె లేని ప్రమిదకదా!" అనుకున్నాడు
చిరుదివ్వె ఇంతలో వెలిగి, సూర్యుని వైపు చూసి
చిరునవ్వు నవ్వింది; సూర్యుడు నిర్ఘాంతపోయాడు!

— డాక్టర్ దాశరథి

రావినూతల సువర్ణాకన్నన్
నవల
కుంభకర్ణుడు
త్వరలో ప్రారంభం

మంది. ఇలా తన పేర ఆస్థి పెట్టడం కొడుక్కు ఇష్టం లేదన్నమాట. తనింకా వుండగానే తనకేం లేకుండా పంచుకు పోదాం అనుకుంటున్నారన్న మాట. ఈ ముసల్దిి ఇంక పదేళ్ళు, ఇరవై ఏళ్ళు అని అప్పుడే లెక్కలు ఆరంభించారన్నమాట. అనుకుంటూ మదన పడింది. కానీ, అనుకోనీ, వీళ్ళ మాటలు పట్టించుకుంటే తను బతక లేదు. ఇన్నాళ్ళు ఆయన హయాంలో ఇప్పుడింక వీడా వీల్లేదు, తన బతుకు తనిష్టం వచ్చినట్టు కొన్నాళ్ళయినా బతకాలి... తన ఇల్లు తన మొగుడాస్థి తనిష్టం... అడగడానికి వీళ్ళెవరు, అనడానికి ఏం హక్కుంది వీళ్ళకి అనుకుందావిడ.

** ** ** **

ఇంట్లో ఒక్క సుబ్రమణ్యంగారు లేక పోయే సరికి, ఇంటికి పెద్ద దిక్కు అయిన ఆయన పోయే సరికి ఇంట్లో ఎలాంటి మార్పులొచ్చాయో, నాల్గు గోడల మధ్య ఎన్నిగొడవలు తలెత్తాయో బయటి వాళ్ళకి తెలియకపో వచ్చుగాని అన్నపూర్ణమ్మగారికి ఈ ఏడాదిలో బాగా అనుభవం అయింది. ఇన్నాళ్ళు తండ్రి చాటు బిడ్డగా వున్న కొడుకు ఈ ఇంటికింక నేనే యజమానిని అన్నట్టు తల్లిని ఏ విషయంలోను మాట మాత్రమైనా సలహా అడగకుండా ఇష్టం వచ్చినట్టు చేయడం ఆరంభించాడు. మామగారున్నరోజులు మాటన్నా వినపడని కోడలు గొంతు రోజంతా వినిపిస్తూనే వుంది. రోజుకి పదిసార్లు... 'ఛా... ఛా... ఈ కొంప ఈ చాకిరి ఈ లంపటం అంతా నాకే చుట్టుకుంది. చూడండి మీ తమ్ముడు ఎంత అదృష్టవంతుడో చుట్టపు చూపుగా నాల్గురోజులు వస్తాడు. అభిమానాలు ప్రేమలు వాళ్ళకి, చాకిరి మనికి మనం చేసేది ఎవరికి కనిపిస్తుంది. ఇంట్లో వుండి తేరగా తిని పోతున్నామన్నదే కనిపిస్తుంది. 'అందుకే వద్దన్నాను' మన దంటూ వేరే వుంటే అమ్ముకుంటామో ఆర్చుకుంటామో' మాతుళ్ళంటే ఆవిడ కంత అభిమానంఅయితేనెత్తినెక్కించుకోమనండి అంతేగాని ఈ చాకిరి నావల్లగాదు. పుట్టిల్లంతా అంతా వచ్చిపోతారు చాకిరికి జీతం, బత్తెం లేని నౌకరి దాన్ని నేనున్నాగా ఈ కొంపలో దేనికి స్వతంత్రం లేదు. ఇంక ఎన్నాళ్ళో ఈ బతుకునాకు, నాది అంటూ ఓ కొంప, సంసారం నాకెప్పుడో' అంటూ ముందు ముందు గొణుగుళ్ళతో ఆరంభించిన ఆ గొంతు ఆరు నెలలు తిరిగే సరికి... తగుదునమ్మా అంటూ అన్నింట్లోను వెలుపెట్టకపోతే కృష్ణా, రామాలనుకుంటూ ఓ మూల కూర్చోకూడదు. ఏం ఈ ఇల్లు నాది కాదు. నాకు తెలియదూ ఏం చేయ్యాలో ఎలా చేయాలో, ఎన్నాళ్ళ నాకు కోడంటికం అంటూ మొదలెట్టి - నాకు తెలుసు నా కెవరి సలహాలు అక్కర లేదు వరకు వెళ్ళి అత్తగారు ఏం అడిగినా దులపరించి పారేసే వరకు వెళ్ళింది. ఏడాదిలోనే పెల్లి మీద ఎలకమీద పెట్టి సాధింపులు సరే - ఎదుటపడితే మొహం చిట్లించడం, మూతి విరుపులు లెక్కలేదు: రోజుకి పదిసార్లు చాకిరి చేస్తున్నానో అంటూ గోల.... అన్నపూర్ణమ్మకి ఏడాదిలోనే నరకం చూపించింది కోడలు - ముందునించి ఆవిడ అంత గట్టిగా తెగేసి, ఎదుటపడి ఎవరిని ఏం అనలేని తత్వం - దానికి తోడు నలభై ఏళ్ళు భర్త హయాంలో అన్నింటికి పడివుండి ఓర్చుకునే తత్వం అలవడిందేమో తనని కాదన్నట్టు వినకుండా వూరుకునేది కొన్నాళ్ళు - మరీ మితిమీరినప్పుడు 'ఏమ్మా ఎవరినంటున్నావో తెలియదనేనా నీ ఉద్దేశం - ఎందుకమ్మా పిల్లిమీద ఎలక మీద పెట్టి అంటావు' అంటూ కోడలిని ఎదురుకునేది.

'అయ్యో నేనెవరినమ్మా అనడానికి నాకేం నోరు నెప్పా అనడానికి' అనేది కోడలు మూతి తిప్పి'

'నా ఇంట్లో నేనుండి, నా సొమ్ము తింటూంటేనే మీ కింత కష్టంగా వుందే - పట్టెడన్నం మీ ఎవరింట్లో నేను తినకపోయినా ఇన్నిమాటలంటున్నావే...

'అయ్యో అయ్యో మాశారా ఈ ఇల్లు నాది, ఆస్థినాది, నా సొమ్ము మీరు తింటున్నారుగాని నేనెవరి సొమ్ము తినడం లేదని ఆవిడంత కచ్చితంగా చెప్తుంటే




ఇటీవల ఆర్మూరులో విజయ్ పబ్లిక్ స్కూల్‌వారు టాలెంట్ షో నిర్వహించిన సందర్భంగా అధ్యక్షోపన్యాసం యిస్తున్న శ్రీమతి తురగా జానకీరాణి, శ్రీమతి విజయ, శ్రీ రాంరెడ్డి, శ్రీ ఎ.బి.కె. ప్రసాద్, శ్రీమతి శారదా శ్రీనివాసన్, శ్రీమతి సుజాత వేదికపై వున్నారు.

ఇంక మీకు సిగ్గు లేదు. పదండి ఏ అద్దెకొంపో దొరక్కపోదు. ఏ రెండు గదుల కొంపన్నా నాది అంటూ వుంటే ఇన్ని మాటలు వినక్కర లేదు. కలో గంజో తాగుదాం పదండి. అంటూ రాగాలు అన్నపూర్ణమ్మని మనశ్శాంతి లేకుండా చేసింది. కొడుకు పెళ్ళాన్ని వెనకేసుకొచ్చి 'ఏమిటమ్మా రోజూ ఇంట్లో గొడవలు అనేవాడు పైగా - లేదంటే అంతా వింటూ నిమ్మకు నీరెత్తినట్టు వుండేవాడు - తల్లి ప్రాణం విసిగి ఏనాడన్నా ఏదన్నా చెప్పబోతే మీ అత్తా కోడళ్ల గొడవలు నాకు చెప్పద్దు... ఛా... ఛా ఛొత్తిగా కొంపలో మన శ్శాంతి లేదు అని విసుక్కునేవాడు - పుట్టింటికి ఆడపిల్లలు వస్తే ఏడుపు - వాళ్ళకి చీర సారె ఇస్తే వున్నదంతా ఆవిడ కూతుళ్ళకే దోచిపెడ్తుంది. ఏం వాళ్ళా ఆస్తి పంచుకుంటారుగా మీతో సమంగా. ఇప్పుడింకా ఈ దోచిపెట్టడం ఎందుకు - ఇంట్లో పిల్లలున్నారు. నేనున్నాను ఒక్కనాడన్నా ఒక జత బట్టలు ఇవ్వాలనిపించిందా ఆవిడకి. అంతేనండి ఇంట్లో వుంటే అందరికి లోకువే- అందుకే పోదాం అంటున్నాను.

పోతే పొండి అనాలన్నంత ఆవేశం వచ్చేది అన్నపూర్ణమ్మకి - లోకులేం అనుకుంటారోనన్న భయంతో పాటు, ఈ ఇంట్లో అడది తను ఒక్కర్తి ఎలా అన్న ఆలోచన ఆవిడని వెనక్కి లాగేది - ఒక్క ఏడాదిలోనే ఇలా అయితే ఇలా ఎన్నాళ్ళు అన్న ప్రశ్న అన్నపూర్ణమ్మని, అటు ప్రభాకర్‌ని వేధించింది.

** ** ** **

సంవత్సరీకాలు వచ్చాయి. మళ్ళీ అంతా బంధువులు చేరారు. సంవత్సరీకాలు ముగిశాయి. 'బాబాయి నాకంటూ ఏం వస్తుందీ నాకు పంచేయాలి బాబాయి - ఈ ఉమ్మడి ఆస్థి వ్యవహారం నాకొద్దు - ఇంట్లో గోల భరించలేను - ఎవరి పాటికి వాళ్ళు హాయిగా వుంటే నాకెందుకీ జంఝాటం నా వాటా నాకు కావాలి' అని కుండబద్దలు కొట్టినట్టు చెప్పాడు రాత్రంతా పెళ్ళాం కీ ఇచ్చి పంపినది అప్పచెప్పేశాడు ప్రభాకర్.

'అదేమిటిరా... ఇప్పుడేం అయిందని... ఏదో చెప్ప బోయారాయన.

'ఏం అయిందో చెపితే అర్థం కాదులే బాబాయి. ఎవరికి వారికుండడం మంచిది. 'ముభావంగా నిష్కర్షగా చెప్పేశాడు. దివాకర్ వంక చూశాడాయన - తమ్ముడు లక్ష్మణుడిలా అన్నగారి మాట జవదాటను అన్నట్టు కూర్చున్నాడు.

"మరి మీ అమ్మ ఒక్కర్తి ఎలా వుంటుందిరా"

"ఒక్కర్తి వుండడం ఏం. ఆవిడకింక ముగ్గురు పిల్లలున్నారు. ఆవిడ కిష్టం వచ్చిన చోట ఇష్టం వచ్చిన న్నాళ్లుంటుంది."

"అలాగే పంచేయి మరిది... ఇంట్లో రోజూ ఈ గొడవలుకంటే అదే నయం అనిపిస్తూంది. నాకూను... ఆయన పోగానే ఇంట్లో అంతా పెద్దలే అయిపోయారు. నిష్ఠూరంగా అంది."

"మరి ఈ ఇల్లు... మీ అమ్మ ఎక్కడుంటుంది. ఇక్కడేవుంటే, మరి మీరు ఈ ఇల్లు నాన్న కట్టించినా, పిత్రార్జితంగా నా కొడుకులకి రావాలి - దివాకర్ బెంగుళూరు కనుక వాడికి ఈ వంతు డబ్బో పొలమో ఇవ్వండి ఇది వరకు రాసుకున్నాంగా"

"మరి మీ అమ్మకి..."

"అమ్మకి డబ్బివ్వండి ఆవిడున్నన్ని రోజులు ఖర్చులకి... ఆడపిల్లలకి ఎలాగూ క్యాష్ అనుకున్నాంగా, పొలం దివాకర్ కి అనుకున్నాంగా."

'అన్నయ్యా స్వంత ఇల్లుండగా అమ్మ వీళ్ళ కొంప వాళ్ళ కొంప పట్టుకు ఎందుకు వేలాడలి" పెద్ద చెల్లెలు నిష్ఠూరంగా అంది.

"అమ్మ మీద అంత ప్రేమ వున్న కూతుళ్ళు అమ్మని తీసికెళ్ళి పెట్టుకోండి' హేళనగా అన్నాడు.

"నన్నెవరూ జాలిపడి తీసికెళ్ళనక్కలేదు. ఏదో రెండు గదులు కొంపచాలు తలదాచుకోవడానికి'

"అదేమిటమ్మా స్వంత ఇల్లుంచుకుని రెండుగదుల అద్దెకొంప ఖర్మ నీకెందుకు, అన్నయ్యా మేం అలా పప్పకోం...' రెండో కూతురు అంది.





"వద్దే తల్లీ, తినే రెండు మెతుకులన్నా వంట పట్టనీండి నాకు. మీనాన్న పోయాక ఈ ఇంట్లో నాకేం గౌరవం మిగిల్చారే అమ్మా, ఈ ఏడాదిగా ప్రతిరోజు నరకం చూశాను - ఆయన వున్నన్ని రోజులు ఆయన హయాంలో బెదురుతూ, ఇప్పుడు కొడుకు కోడలు జులుం సహించే ఓపిక నాకు లేదే అమ్మా నా ఖర్మానికి నేనుంటాను' అన్నపూర్ణమ్మ బాధగా అంది.

"అన్నపూర్ణా ... పూర్ణా' నారాయణ చేతిలో ఉత్తరంతో వగర్చుకుంటూ వచ్చాడు' అమ్మాయే మావగారి ఉత్తరం... ఉత్తరం వచ్చిందే' అన్నాడు వగరుస్తూ ఆయాసపడ్డాడు. అంతా తెల్లబోయారు.

"బావగారి ఉత్తరంఏమిటరా... ఆయనపోయిఏడాది అయితే 'అన్నపూర్ణమ్మ తెల్లపోయింది.

"ఏమో కావాలంటే చూడండి - రిజిష్టర్ ఉత్తరం - ఫ్రమ్ అడ్రసు బావగారి పేరున వుంది. చింపి చదువు ముందు, ఆరాటంగా అన్నాడు. ప్రభాకర్ ఆరాటంగా ఉత్తరం అందుకుని చింపి తల్లి పేర వుండడంతో తల్లికి అందించాడు.

'అన్నపూర్ణా - ఈ ఉత్తరం ఇప్పుడెక్కడ నించా అని ఆశ్చర్య పడకు - చాలా కాలం కిందటే రాశాను అవసరం వచ్చినప్పుడు నీకు పంపమని నా మిత్రుడు రాఘవద్వారా ఏర్పాటు చేశాను. అన్నపూర్ణా ఆడదానికి తోడయినా నీడయినా కట్టుకున్న వాడేగాని కన్నవాళ్ళు గాదన్న సత్యం నీవు ఈ పాటికి గ్రహించి వుంటావు. నలభై ఏళ్ళలో నీకు నేను తోడుగా నీడగా నిలవ లేదని నీవనుకున్నావు. పిల్లలతో - మీ నాన్న ఇలా, అలా అని నేరాలుచెప్పుకోవడం చెవులారా విన్నాను. కాని అప్పుడు నీ మాట నిజం కాదని నేను నోటితో చెపితే నీవు నమ్మవు. అనుభవం వస్తేగాని నిజం అర్థం కాదు అని వూరుకున్నాను. కష్టమో,





## విజయవాడ ఆకాశవాణి సాధించిన హ్యాట్రిక్

మన దేశంలోని పద్నాలుగు భాషలకి తొంభై నాల్గు రేడియో స్టేషన్లున్నాయి. అవి ప్రసారం చేసే కార్యక్రమాలలో, ఉత్తమమైన వాటికి ఏటా జాతీయ స్థాయిలో బహుమతులుంటాయి. ఈ ఏడాది ఏభై ఆరు రేడియో స్టేషన్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. 1974 నుంచి మధ్యలో రెండు మూడు సంవత్సరాలు తప్ప ప్రతి ఏటా బహుమతులు గెలుచుకుంటూనే వుంది విజయవాడ రేడియో స్టేషను.అయితే ఈ ఏడాది విశేషించి నాలుగు బహుమతులు సంపాదించుకున్న ఘనత ఈ కేంద్రానికి దక్కింది.

ఈ విజయోత్సాహాన్ని పురస్కరించుకుని 12—3—87 గురువారం సాయంత్రం 6 గంటలకు విజయవాడ రేడియో స్టేషన్ ప్రాంగణంలో జరిగిన సభకు స్టేషన్ డైరెక్టర్ శ్రీ అయూబ్ అధ్యక్షత వహించారు.

శ్రీ ఇంద్రగంటి శ్రీకాంతశర్మ రచించిన "వర్షానందిని" సంగీత కార్యక్రమానికి మొదటి బహుమతి, ట్రోఫీ లభించాయి. ఈ కార్యక్రమానికి సంగీత నిర్వహణ శ్రీ కె. కృష్ణమోహన్. "నేను కాని నేను" అనే సృజనాత్మకమైన శ్రవ్య కావ్యానికి మొదటి బహుమతి, ట్రోఫీ లభించాయి. ఈ కార్యక్రమ రచన శ్రీ ఇంద్రగంటి శ్రీకాంతశర్మ, నిర్వహణ శ్రీ ఎన్.బి. శ్రీరామమూర్తి. శ్రీ ఎం. దివాకరబాబు రచించిన "వల్లనివాడు" నాటికకు ప్రశంసా పత్రం లభించింది. నిర్వహణ శ్రీ మాడుగుల రామకృష్ణ. శ్రీ ముక్కామల నాగభూషణం రచించిన "సిరుల గోదారి" కార్యక్రమానికి నిర్వహణ శ్రీ వై. హనుమంతరావు. సంగీతం స్వర్గీయ ఎస్.సి.వి. జగన్నాథాచార్యులు సమకూర్చారు.

హాజరైన బహుమతి గ్రహీతలను అసిస్టెంటు స్టేషన్ డైరెక్టర్ శ్రీ ప్రపంచం సీతారామ్ సభకు పరిచయం చేశారు.

సభలో శ్రీ రజనీకాంతరావు, శ్రీ కర్నాటి లక్ష్మీనరసయ్య ప్రధానంగా ఉపన్యసించారు. మరికొందరు పుర ప్రముఖులు కూడా పాల్గొన్నారు. ప్రొడక్షన్ అసిస్టెంట్ శ్రీ ఎం. బాబూరావు వందన సమర్పణ చేశారు.

— వి.పా.శా.

నష్టమో, సుఖమో ఆడదానికి మగాడి తోనే వుంటుంది అని నీవు నీ అంతట నీవే తెల్సుకుంటావని నీ అభిప్రాయం మార్చాలని నేనెప్పుడూ తాపత్రయ పడ లేదు. పూర్ణా!మగాడి ప్రేమ నూతి నీరులా నిశ్చలంగా లోతు తెలియనంత వుంటుంది. తోడితే తప్ప నీకు తెలియదు. నీ వెంత బాల్చితో తోడితే అదే దక్కుతుంది గాని అంతకు మించి నూతినీరంతా నీకెలాదక్కుతుంది. పెట్టిందే దక్కుతుంది అన్ననానుడిలో నీవుతోడుకున్నదే నీకు దక్కుతుది. నీవు ఒక చిల్లు బాల్చి తీసుకొచ్చి తోడి నీరు నీకు సరిగా దక్కలేదని వాపోవడం సబబా - తోడుకున్నప్పుడు బాల్చి నూతికి తగిలి ధక్కా మొక్కీలు తినవచ్చు. అంత మాత్రాన బాల్చిదెబ్బ తింటుందని నీరే తోడుకోక దూరంగా నిలిస్తే నష్టపోయేది ఎవరు! నీ విషయంలో అదే జరిగింది.మగాడ్ని, మగాడ్నిఆకట్టుకునే తెలివి ఆడదానికుండాలి అది నీకు లేక నా మీదే నిష్ఠూరాలు వేశావు. కార్యేషు దాసి... అన్న నానుడిలా తోడయి, నీడయి, తల్లయి ఆడది నిలిస్తేతను గొడుగయి ఆడదానికి చోటివ్వని మగాడెవడు! నా గొడుగు మీద నీకు నమ్మకం లేక దూరంగా నిల్చుండిపోయావు. అన్నపూర్ణా పిల్లలెప్పుడూ నీడిచ్చే చోటుకి చేరుతారు తప్ప నీడివ్వరు. గొడుగయినా, నీడయినా భర్తే భార్యకి అన్నది'చెప్పడానికి నీకీఉత్తరం రాస్తున్నాను. రెక్కలొచ్చిన పిల్లలని గూటినించి తరిమేసే పశు పక్ష్యాదుల జీవన రీతే సరి అయింది అని నాకనిపిస్తుంది. అందులోనే అందరికి సుఖం వుంది. అని ఎన్నో కేసులు చూసిన లాయరుగా నాకు తెలుసు కనుక ఈ ఇల్లు, నీ సుఖ జీవనానికి సరిపోయిన డబ్బు నీకు రాశాను. ఇంట్లో వుంటావో, అమ్ముకుంటావో, ఆదుకుంటావో ఏం చేసినా సర్వ హక్కులూ నీవే. మిగతాదే పిల్లలకి ఈ ఇల్లు నీది కాదు అని ఎవరన్నా అన్నపక్షంలో ఈ ఉత్తరం ఈ విల్లు బయటపెట్టమని నా మిత్రుడిని ఆదేశించాను. నా అంచనాలు తప్పయి నీ పిల్లలు నిన్ను కంటికి రెప్పలా కాసుకుంటే ఈ విల్లు అవసరం వుండదు. కాని అలా నూటికో కోటికో గాని జరగదని తెలిసే విల్లు రాశాను. నాజీవితానుభవంతో నేను రాసిన ఈ ఉత్తరానికి ముందే నీ అనుభవం నీకు పాఠం నేర్పి వుంటుంది.

"ఏమ్మా... ఉత్తరం అందిందా. ఇదిగో సుబ్రమణ్యం విల్లు తెచ్చాను. ఇది ముందు చెప్పద్దన్నాడనిదాచానమ్మా. పక్కింటివాడ్ని ఈ ఇంట జరుగుతున్నవన్నీ కనిపెట్టి వాడు చెప్పినట్టే చేశాను అన్నపూర్ణమ్మా. సుబ్రమణ్యం మనిషి మాట సున్నితం కాకపోయినా మనసు నవనీతం అది కరగడానికి చిన్నపాటి సెగచాలమ్మా - ' అది ఉత్తి అమాయకురాలురా తెల్లనివన్నీ పాలు అనుకుంటుంది గాని అందులో నీళ్ళున్నాయి అని గ్రహించలేదురా... ఆ సంగతి చెప్పినా వప్పకోరురా ఆడవాళ్లు అనేవాడు. మనసులో ఆవిడంటే ఇంత అభిమానం వుంచుకుని చూపించకపోతేఏం లాభంరా.ఇనప్పెట్టెలోడబ్బుంచుకుని ఖర్చు చేయకుండా దాస్తే ఏం ప్రయోజనం. ఎదుటి వారికి నీ కస్సు బుస్సులేఅర్థం అవుతాయిగానిఅభిమానం' చూపందే ఎలా అర్థం అవుతుంది అని వాదించేవాడిని. వాడు నవ్వేవాడు ఇనప్పెట్టెలో డబ్బుంది అన్నతృప్తి, అవసరం వస్తే ఆదుకుంటుంది అన్న నిజం ఆమెకి తెలియాలి గాని నేను చెప్పకూడదురా నీ వంటే ఇంత ప్రేమ అంత ప్రాణం అని కబుర్లు చెప్పేవాడెప్పుడూ కార్యాచరణలో పెట్టడు. ఐయామ్ మాన్ ఆఫ్ డీడ్స్ నాట్ వర్డ్స్ అనేవాడు. వాడు తొణకని నీటికుండమ్మా. అదిప్పుడు చేసి చూపెట్టాడు చూశావా అమ్మా - ఈ ఇల్లు నీది. ఈ డబ్బు నీది. ఇదిగో నెలకింత అని నీ పేర వచ్చేటట్టు వేశాడు. మిగతాది పిల్లలకి రాసిన విల్లు. రాఘవయ్యగారు విల్లు చదివివినిపించారు. అన్నపూర్ణమ్మ మొహం సిగ్గు, బాధ, అవమానం, పశ్చాత్తాపం రకరాల భావాలతో ఎర్రబడింది.

భర్త పోయిన రోజున రాని కన్నీరుని లోకం కోసం పదే పదే తుడుచుకున్న ఆవిడ... ఈ రోజు... సంవత్సరం తరువాత అదే భర్త పోయినట్టు ఆగకుండా కారుతున్న కన్నీటిని తుడుచుకునే ప్రయత్నంచేయలేదు.

** ** ** **

"ప్రభాకర్, ఈ ఫస్టులోగా మీ రెక్కడయినా అద్దె ఇల్లు చూసుకుని ఇది ఖాళీ చెయ్యండి బాబూ, ఈ ఇల్లు నాకు కావాలి" ప్రభాకర్ తెల్లపోయాడు. పద్మమొహం అవమానంతో ఎర్రబడింది.

"ఏమిటి మమ్మల్ని ఇంట్లోంచి వెళ్ళమంటున్నావా, అద్దె ఇల్లు చూడమంటున్నావా? నమ్మలేనట్టు అన్నాడు.

"అవును నాయనా. ఇన్నాళ్ళు నా ఇల్లు, నా పిల్లలు అనుకుంటూ స్వార్థంతో ఇహలోక చింతనతో గడిపాను. నా అనుకున్నవాళ్ళు నా వాళ్ళు కాదని అర్థం అయ్యాక ఇహనైనా పరలోక చింతతో గడపాలనుకుంటున్నాను శేషజీవితం. ఆస్తినంతా నాపేర వున్నా మీ నాన్నగారు పోగానే మీరు నన్నెంత చిన్నచూపు చూసి ఎన్ని మాటలన్నారో మీకు తెలుసు. అలాంటిది నాలాంటి ఎందరో ముసలి వారు ఆస్థి పాస్తులులేక కన్నబిడ్డల మీద ఆధారపడి కుక్కల్లా హీనంగా బతుకుతున్నారు. మన పక్కింటి లలితమ్మని చూస్తేకడుపు తరుక్కుపోతుంది. నాకు అలాంటి లలితమ్మలు ఎందరో కన్నబిడ్డల దగ్గిర నికృష్ట జీవితం గడుపుతున్నారు. అలాంటి వాళ్లందరిని ఓ చోట చేర్చి ఒకరికొకరం తోడయి నీడయి కష్టాలలో కష్టాలు పంచుకుంటూ, నా చాతనయిన సుఖం అందించి పరలోక చింతనకి దారి ఏర్పరుచుకోవాలని వుంది. అందుకు మీనాన్న వీలు కల్పించిపోయారు. మీ అందరికి రెక్కలొచ్చాయి. ఎవరిగూడు వాళ్ళు కట్టుకోగలరు. ఈ గూడు నాకు వదలండి. నా తదనంతరం నా లాంటి వారికి ఈ గూడు గొడుగు నీడయి ఆశ్రయం ఇవ్వాలని నా కోరిక... ఈ గూడు వదలి మరో గూడు వెతుక్కోండి బాబూ... నా బతుక్కి నన్ను వదలండి 'చేతులు జోడించి అన్న అన్నపూర్ణమ్మని నల్లబడ్డ మొహాలతో చూశారు ప్రభాకర్ - పద్మ.